ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అనకాపల్లి జిల్లా వార్తలు
గురువారం 3 అక్టోబరు 2024



ఘనంగా మహాత్ముని జయంతి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాలతోపాటు బహిరంగ ప్రదేశాల్లో మహాత్ముని విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ శాంతియుతంగా పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేశారని పలువురు వక్తలు కొనియాడారు. అహింసతో ఏదైనా సాధించవచ్చని ఆయన నిరూపించారని, మహాత్మాగాంధీ స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనకాపల్లి ఎంపీ, పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ నెహ్రూచౌక్ కూడలిలో ఏర్పాటు చేసిన ఖాదీ వస్త్రాల ప్రదర్శనను ప్రారంభించిన సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాగా దేశ రెండో ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని కూడా ఘనంగా నిర్వహించారు.



అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో మహాత్మాగాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, కూటమి నాయకులు



136 మద్యం షాపులు

ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ

- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- 9వ తేదీ వరకు గడువు
- 11వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక
- రెండేళ్లపాటు లైసెన్స్, ఏడాది తరువాత పది శాతం ఫీజు పెంపు
- 12వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం అమ్మకాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కొత్త మద్యం పాలసీకి సంబంధించి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జిల్లాలో 136 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 11వ తేదీన లాటరీ ద్వారా షాపులను కేటాయిస్తారు. ఆ మరుసటి రోజు నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల్లో విక్రయాలు ప్రారంభం అవుతాయి.



మద్యం సీసాలు (ఫైల్ ఫొటో)

గత వైసీపీ ప్రభుత్వం సొంతంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి ఊరు పేరు లేని నాసికరం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ మద్యం మాటున భారీ ఎత్తున అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం రాత్రి గెజిట్ నోట్ విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 136 ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. జనాభా ప్రాతిపదికన షాపులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. 10 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజు రూ.50 లక్షలు. 10,001 నుంచి 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50,001 నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న పట్టణాల్లో లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలు, జనాభా 5 లక్షలు దాటిన నగరాల్లో లైసెన్స్ ఫీజు రూ.85 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. 21 సంవత్సరాలు నిండిన వ్యక్తులు మాత్రమే మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయాలి. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తులు అందజేయవచ్చు. ఆన్‌లైన్‌లో లేదా స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్, పాన్‌కార్డుతో పాటు రూ.2 లక్షల (నాన్ రిఫండబుల్) జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ లైసెన్సింగ్ అథారిటీ పేరుమీద డీడీ లేదా చలానా తీయాలి. దరఖాస్తు చేయడానికి ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువు వుంది. 11వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి అనకాపల్లి పాత బస్టాండ్ సమీపంలోని ఉప్పాల చంద్రశేఖరరావు కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి మద్యం షాపుల లైసెన్స్‌దారులను ఖరారు చేస్తారు. 12 తేదీ నుంచి 2026 సెప్టెంబరు 30 వరకు మద్యం షాపులు నడుపుకోవచ్చు. ఏడాది దాటిన తరువాత లైసెన్స్ ఫీజు పది శాతం పెరుగుతుంది. లాటరీ ద్వారా మద్యం దుకాణాలను పొందిన వ్యాపారులు లైసెన్స్ ఫీజులను ఆరు విడతల్లో చెల్లించవచ్చు.

జిల్లాలో 136 మద్యం దుకాణాల ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు గెజిట్ నోట్ ప్రకటించారు. అనకాపల్లి పట్టణం (జీవీఎంసీ పరిధి)లో 12 దుకాణాలు ... మిగతా 8వ పేజీలో

వరిపై తెగుళ్ల దాడి

వాతావరణంలో మార్పులతో చీడపీడలు విజృంభణ

- ఉల్లికోడు, మొవ్వుకుళ్లు, అగ్గి తెగులు, ఆకుముడత పురుగు లక్షణాలు
- వెంటనే అరికట్టకపోతే దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన
- యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారుల సూచన

చోడవరం, అక్టోబరు 3:

ప్రస్తుతం పొట్ట దశలో వున్న వరి పైరుపై పలు రకాల తెగుళ్లు దాడి చేస్తున్నాయి. వర్షాలు కురవడం, వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడం వంటి వాతావరణ మార్పుల కారణంగా తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం వరి పొలాల్లో ఉల్లికోడు, మొవ్వుకుళ్లు, పాచి తెగులు, ఆకుముడత పురుగు, అగ్గి తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయి. వీటిని నివారించడానికి రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు.



వరి పైరుకు క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న రైతు



తెగులుసోకి ఎండిపోతున్న వరి ఆకులు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు కొంత ఆలస్యంగా కురిసినప్పటికీ తరువాత పరిస్థితులు అనుకూలించి పుష్కలంగా వర్షాలు పడ్డాయి. వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల మేరకు వరినాట్లు పూర్తయ్యాయి. గత నెలలో రెండు పర్యాయాలు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండా ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. నాలుగైదు రోజుల్లో ముంపు తగ్గడంతో వరిపైరు కోలుకున్నది. ముందస్తుగా నాట్లు వేసిన పొలాల్లో వరి పంట దుబ్బులు కట్టడమే కాకుండా పొట్టదశలో వుంది. కాగా కొద్దిరోజుల నుంచి వేసవిని తలపించేలా ఎండలు తీక్షణంగా కాస్తుండడంతో వరి పైరుపై పలు రకాల తెగుళ్ల దాడి చేస్తున్నాయి. ఉల్లికోడు, మొవ్వుకుళ్లు, పాచి తెగులు, మడత పురుగు, అగ్గి తెగులు కనిపిస్తున్నాయి. దీంతో పలువురు రైతులు క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు 'పొలం పిలుస్తోంది' పేరుతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటలను పరిశీలిస్తున్నారు. తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. వరి సాగు చేస్తున్న అన్ని గ్రామాల్లో ఏదో ఒకరకం తెగులు కనిపిస్తున్నదని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. వెంటనే తెగుళ్లను అరికట్టకపోతే ధాన్యం దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అగ్గితెగులు, ఆకు ముడత పురుగు బెడద



నేను రెండు ఎకరాల్లో వరినాట్లు వేశారు. కొద్ది రోజుల నుంచి అగ్గి తెగులు, ఆకు ముడత పురుగు బెడద ఎక్కువగా ఉంది. వరి దుబ్బుల మొదళ్లలో పురుగులు ఎక్కువగా ఉంటున్నాయి. ఇవి ఆకుల్లో రసం పీల్చేస్తున్నాయి. క్రిమిసంహారక మందుల పిచికారీ కోసం వారం రోజుల్లోనే రెండు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది.

- బుద్ద నాగరాజు, జుత్తాడ, చోడవరం మండలం

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ

వరి పొలాల్లో తెగుళ్ల నివారణకు రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. వరి పొలంలో ప్రతి రెండు మీటర్లకు అర అడుగు వెడల్పున కాలిబాటలు తీసుకోవాలి. దీనివల్ల వరి దుబ్బులకు గాలి, వెలుతురు బాగా తగిలి, సుడిదోమ బెడద తగ్గుతుంది. ఆకుముడత పురుగు బెడద అధికంగా వుంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటికి రెండు గ్రాములు, లేదా క్లోరాంట్రీనిలిప్రోల్ 0.3 మిల్లీమీటర్లు కలిపి పురుగు ఉధృతి తగ్గే వరకు వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పొడ తెగులు ఉన్నట్టయితే హెక్సాకొనజోల్ ఏ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడామైసిన్ మందు రెండు మిల్లీలీటర్లు కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

- పావని, మండల వ్యవసాయ అధికారి, చోడవరం

ఏయూలో కొత్త కోర్సులు

ఇంజనీరింగ్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు

- బీటెక్‌లో వీఎల్ఎస్ఐ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ కోర్సులు
- విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యమంటున్న వర్సిటీ అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి బీటెక్, ఎంటెక్‌లలో నూతన బ్రాంచీలను ప్రవేశపెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చునంటున్నారు.



బీటెక్‌లో వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ) కోర్సును ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేం దుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అంగీకరించింది. ఈ మేరకు మైటీ (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) కార్యదర్శి ఎస్.కృష్ణతో ఏయూ అధికారులు సంప్రతింపులు జరిపారు. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు భారీ వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది నుంచే దీనిని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వీఎల్ఎస్ఐ కోర్సు చేస్తే మైక్రో చిప్‌లు తయారీ, సెమీ కండక్టర్ల రూపకల్పన, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు తయారీ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ కోర్సు నిర్వహణ కోసం అడ్వాన్స్‌డ్ లేబొరేటరీ, ఫ్యాకల్టీ, రీసెర్చ్ ప్రాజెక్టులను కూడా 'మైటీ' సమకూర్చనున్నది. దీంతోపాటు ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సును వచ్చే ఏడాది నుంచి ప్రారంభించనున్నారు. అదే విధంగా ఇప్పటికే అపారమైన అవకా శాలను కల్పిస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి కోర్సులను వచ్చే ఏడాది నుంచి ప్రత్యేక బ్రాంచీలుగా ఏర్పాటుచేసి ప్రవేశాలు కల్పించేందుకు ఏయూ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిని బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూకేషన్స్ డిపార్టుమెం ట్‌లతో అనుసంధానం చేయనున్నారు.

సీట్లపై తర్జనభర్జన

ఆయా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్న అధికారులు ఎన్ని సీట్లతో ప్రారంభించాలన్న దానిపై తర్జనభర్జన పడుతున్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్‌లతో సంప్రతింపులు జరుపుతున్నారు. రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ... మిగతా 8వ పేజీలో

ఈదురు గాలుల బీభత్సం

ఎలమంచిలిలో భారీ వర్షం

- నేల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- మూడు గంటలపాటు నిలిచిన కరెంటు సరఫరా

ఎలమంచిలి, అక్టోబరు 2:

ఎలమంచిలి పట్టణంలో బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పెద్ద సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇదే సమయంలో భారీ వర్షం కురవడంతో వీధులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.



పరమేశ్వరి థియేటర్ సమీపంలో రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం, చెట్లు



యర్రవరంలో ఇంటిపై కూలిన భారీ వృక్షం

ఎలమంచిలిలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాసింది. రెండు గంటల నుంచి క్రమేణా వాతావరణం మారిపోయి ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. 2.30 గంటల సమయంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. కొద్దిసేపట్లోనే వర్షం మొదలైంది. సుమారు గంటన్నరపాటు భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో పట్టణంలో పదుల సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురు గాలులు వీచడం మొదలైన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం పూర్తిగా తగ్గిన తరువాత చెట్లు, స్తంభాలు కూలని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్తు, అగ్నిమాపక శాఖల సిబ్బంది రంగలోకి దిగారు. రహదారుకు అడ్డంగా కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించడం ప్రారంభించారు. పెదపల్లి రోడ్డుపై పలుచోట్ల చెట్లు కూలడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. యర్రవరం సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తులసీనగర్, కోర్టుపేట, రామ్‌నగర్, తదితర పలు ప్రాంతాల్లో కూడా పలు వృక్షాలు కూకటివేళ్లతో సహా నేలకూలాయి. యర్రవరంలో ఒక ఇంటిపై భారీ చెట్టు కూలిపోయింది. అయితే ఎటువంటి ప్రమాదం వాటిల్లకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు రంగంలోకి దిగారు. అగ్నిమాపక, విద్యుత్, మునిసిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్లతో పడిపోయిన చెట్లను తొలగించారు. చైర్‌పర్సన్ రమాకుమారి వార్డుల్లో పర్యటించి, పునరుద్ధరణ పనులను పరిశీలించారు.



యర్రవరం సమీపంలో కూకటివేళ్లతో సహా కూలిన చెట్టు

రేషన్‌లో కందిపప్పు

ఒక్కో కార్డుకు కిలో చొప్పున పంపిణీ

- తొలివిడతలో జిల్లాకు 180 టన్నులు కేటాయింపు
- ముందుగా పట్టణ ప్రాంతాల్లో సరఫరా



అనకాపల్లి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నేపథ్యంలో జిల్లాలో రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 5,47,312 కుటుంబాలకు కిలో రూ.67 చొప్పున పంపిణీ చేయడానికి 547 టన్నుల కందిపప్పు అవసరమని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు గత నెలలోనే ఇండెట్ పెట్టారు. ఇప్పటికే 180 టన్నుల కందిపప్పు జిల్లాకు కేటాయించిందని, ఇందులో 50 టన్నుల కందిపప్పు ఇప్పటికే పౌర సరఫరాల శాఖ గోదాములకు చేరాయని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కేఎస్ మూర్తి తెలిపారు. తొలుత పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలకు కందిపప్పు కేటాయించి ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు అందజేస్తామని తెలిపారు. జిల్లాకు కేటాయించిన మిగిలిన కందిపప్పు రాగానే అంగన్‌వాడీ కేంద్రాలకు, గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు.

కొండకర్లలో గ్రావెల్ దందా

గెడ్డ పోరంబోకు భూమిలో యథేచ్ఛగా తవ్వకాలు

- పట్టపగలు ట్రాక్టర్లతో తరలింపు

అచ్యుతాపురం, అక్టోబరు 2:

మండలంలోని కొండకర్లలో గెడ్డ పోరంబోకు భూమిలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతు న్నాయి. సర్వే నంబరు 99లోని ప్రభుత్వ భూమిలో ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వి, ట్రాక్టర్లతో తరలించుకు పోతున్నారు. పట్టపగలే గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు. కొండకర్ల-బంగారయ్యపాలెం మధ్యలో ఇళ్ల స్థలాల వెంచర్ల వెనుక కొండ ఉంది. మెయిన్ రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న ఈ ప్రదేశం నుంచి గ్రావెల్ తీసుకెళ్లడానికి తుప్పలు, డొంకలు తొలగించి కచ్చా రహదారి నిర్మించారు. ఇళ్ల పునాదులు కప్పడానికి, ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి ఈ గ్రావెల్‌ను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్ రూ.2 వేలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది.





గెడ్డ పోరంబోకు భూమిలో గ్రావెల్ తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్, రవాణా చేస్తున్న ట్రాక్టర్ (ఇన్‌సెట్‌లో) గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన గొయ్యి

క్రైం... crime news

స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ ఒకరి మృతి

అచ్యుతాపురం, అక్టోబరు 2: కొండకర్లలో గల ఓ రిసార్టులోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ నమ్మి గణేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సెజ్‌లోని అభిజిత్ కర్మాగారంలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులు కొండకర్లలోగల ఒక రిసార్టులో మంగళవారం గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం వీరిలో నలుగురు రిసార్టులో గల స్విమ్మింగ్‌పూల్‌లో ఈతకొడుతున్నారు. ఇందులో విశాఖపట్నంలోని గోపాలపట్నం ఆదర్శనగర్‌కి చెందిన పెదపాటి రాజు(39) కూడా ఈత కొడుతూ నీటి అడుగు భాగానికి వెళ్లిపోయాడు. కిందకు వెళ్లిన రాజు పైకి రాకపోవడంతో తోటి స్నేహితులు బయటకు తీశారు. వెంటనే అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది రాజును అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అతను మృతిచెందినట్టు తెలిపారు. కాగా రాజు గతంలో అభిజిత్ కర్మాగారంలో పనిచేసి రెండేళ్ల క్రితం మానేశాడు. ప్రస్తుతం సెంచూరియన్ యూనివర్సిటీలో హార్డ్‌వేర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. పాత స్నేహితులంతా కలిసి కొండకర్లలో గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకోవడంతో ఇక్కడికి వచ్చాడు. స్విమ్మింగ్ పూల్ కేవలం నాలుగున్నర అడుగుల లోతే ఉందని, గుండె సంబంధించిన వ్యాధి కారణంగా మృతిచెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో తేలిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తూరు, అక్టోబరు 2: అనకాపల్లి మండలం పిసినికాడ కూడలి వద్ద రోడ్డు దాటుతున్న పాదచారిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. పిసినికాడకు చెందిన రాజగిరి కాశీ కశింకోట నుంచి ఆటోలో పిసినికాడ వచ్చాడు. అక్కడి రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన పాసిలి శ్రీను(34) ద్విచక్ర వాహనంపై వచ్చి కాశీని ఢీకొన్నాడు. శ్రీను తలకు తీవ్రగాయం కావడంతో వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే శ్రీను మృతి చెందాడు. కాగా రోడ్డు దాటుతున్న కాశీ కాలుకు తీవ్ర గాయం కావడంతో అనకాపల్లిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

కొత్తూరు, అక్టోబరు 2: తల్లి మందలించిందని పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం వల్లూరు గ్రామానికి చెందిన సిమ్మా జ్యోతి (26) తన తల్లి వరమందలించిందని మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. కొద్ది సేపటికి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తల్లి బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త నూకరాజు, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నేటి నుంచి టెట్

» ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాలు, 60,574 మంది అభ్యర్థులు

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకూ విశాఖ జిల్లాలో ఏడు కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో ఒక కేంద్రంలో ఆన్‌లైన్‌లో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. మొత్తం 60,574 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తొలిసారి నిర్వహిస్తున్న టెట్‌కు విద్యా శాఖ అన్ని ఏర్పాట్లుచేసింది. ప్రతి కేంద్రానికి ఒక పరిశీలకుడిని నియమించింది. టెట్ నిర్వహణకు సంబంధించి డీఈవో కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే కేంద్రాలకు రావాలని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ విజ్ఞప్తి చేశారు.

ఈదురు గాలులతో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

» నేడు ఎలమంచిలిలోని పలు వార్డుల్లో తాగునీటి సరఫరా బంద్



రామ్‌నగర్ సమీపంలో నేలవాలిన విద్యుత్ స్తంభం

ఎలమంచిలి, అక్టోబరు 2 : ఎలమంచిలిలో బుధవారం మధ్యాహ్నం తరువాత ఈదురు గాలులతో వర్షం కురవడంతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. పట్టణంలోని కొత్తపేట, రామ్‌నగర్, పెదపల్లి రోడ్డు, మిలట్రీ కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ, తులసీనగర్, రంగావారి వీధి, ఓరుగంటి వారి వీధి, జలాలు వీధి, ధర్మవరం, యర్రవరం, మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో సమీపంలోని విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రభావం తాగునీటి సరఫరాపై పడింది. గురువారం ఉదయం దాదాపు సగం వార్డులకు కొళాయిల ద్వారా మంచినీరు సరఫరా జరగదని అధికారులు తెలిపారు. కాగా వర్షం తగ్గిన మునిసిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఎలమంచిలి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో 20కి పైగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఈదురుగాలుల కారణంగా పట్టణంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్తంభాలు దెబ్బతిన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్లను రంగంలోకి దించి కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించారు. తొలుత రాత్రి ఏడు గంటల ప్రాంతంలో మెయిన్ రోడ్డు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం ధర్మవరం వార్డు, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతంలో, రాత్రి 8.30 గంటలకు మిలట్రీ కాలనీ, రంగావారి వీధి, ఓరుగంటివారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పెదపల్లి రైల్వే గేటు సమయంలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఇక్కడ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. రాత్రి పదిన్నర గంటలకు ఇక్కడ కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాగా గంటల తరబడి విద్యుత్ సరఫరా లేకపోవడంతో పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీటి సరఫరా జరగలేదని మునిసిపల్ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 4వ వార్డు నుంచి 11వ వార్డు వరకు, 24, 25 వార్డులకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా వుండదని, ఈ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

మత్స్యకారుని గేలానికి చిక్కిన భారీ టేకు చేప



టేకు చేప

అచ్యుతాపురం, అక్టోబరు 2: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన మత్స్యకారుడి గేలానికి సముద్రంలో భారీ చేప చిక్కింది. ఎప్పటిలాగే బుధవారం ఉదయం మత్స్యకారులు పడవలపై చేపల వేటకు వెళ్లారు. ఓ మత్స్యకారుడి గేలానికి 80 కిలోల బరువు గల పెద్ద టేకు చేప చిక్కింది. దానిని అతికష్టమ్మీద ఒడ్డుకు చేర్చారు. ఆ చేపను ఓ వ్యాపారి కిలో రూ.110 చొప్పున కొనుగోలు చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	104.00
లైవ్ ధర	124.00
విత్ స్కిన్	218.00
స్కిన్ లెస్	228.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

'పేట' పంచాయతీ స్థలం ఆక్రమణ

సుమారు రూ.2 కోట్ల విలువైన ఆస్తికి రెక్కలు

» లేఅవుట్‌లో పంచాయతీకి 408 గజాలు కేటాయింపు
» తర్వాత సగానికి తగ్గిన స్థలం
» ఎనిమిది నెలల క్రితం వెలుగులోకి వచ్చినా మేల్కొని అధికారులు



పంచాయతీ స్థలంలో సిమెంటు తూరల వ్యాపారం చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, అక్టోబరు 2 : పట్టణంలో అక్రమ లేఅవుట్లు, కట్టడాల నియంత్రణకు పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. అక్రమ లేఅవుట్లు, కట్టడాల సంగతి పక్కన బెడితే గతంలో పంచాయతీకి కేటాయించిన స్థలాలను కూడా కబ్జా చేసి దర్జాగా విక్రయిస్తున్నారు. మెయిన్‌రోడ్డులో అత్యంత విలువైన పంచాయతీ స్థలంలో సగం విస్తీర్ణం మా యమవడం ఇందుకు నిదర్శనం.



పంచాయతీ స్థలంలో గతంలో అధికారులు ఏర్పాటుచేసిన బోర్డులో 408 గజాలుగా పేర్కొన్న దృశ్యం



ఈ ఏడాది ప్రారంభంలో స్థల విస్తీర్ణం తొలగించి కొత్తగా ఏర్పాటు చేసిన బోర్డు

పాయకరావుపేట పట్టణంలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహం ఎదుట సర్వే నం.132/3బిలోని ఎ.1.74 ఎకరాల్లో 1985లో వేసిన లేఅవుట్‌కు పంచాయతీ అధికారి అనుమతి ఇచ్చారు. ఈ స్థల యజమాని కుటుంబీకుల గోళీలు ఉన్న స్థలాన్ని ప్రజోపయోగం కోసం కేటాయించినట్టు లేఅవుట్‌లో పేర్కొన్నారు. 2013లో పంచాయతీ స్థలం పక్కనే ఉన్న స్థలాన్ని అమ్మకానికి పెట్టారు. అయితే ఈ లేఅవుట్‌లో 5 శాతం కూడా పంచాయతీ స్థలం లేకపోవడాన్ని గుర్తించిన అప్పటి పంచాయతీ ఈఓ రఘునాథ్‌బాబు తమ రికార్డుల ప్రకారం ఈ లేఅవుట్‌లో 408 గజాలు ఉండాలని పేర్కొంటూ పంచాయతీ స్థలంలో బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అంతేతప్ప 408 గజాల పంచాయతీ స్థలాన్ని లేఅవుట్ యజమానుల నుంచి స్వాధీనం చేసుకోలేదు.

ఇదిలా ఉండగా. పంచాయతీ స్థలం పక్కనే ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి ఈ ఏడాది ప్రారంభంలో భవన నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మేల్కొన్న పంచాయతీ అధికారులు లేఅవుట్ వేసిన వ్యక్తులు పంచాయతీకి కేటాయించిన 408 గజాలను అప్పగిస్తేనే ప్లాన్ అప్రూవల్ ఇస్తామని నిబంధన పెట్టారు. ఇది జరిగి ఎనిమిది నెలలు కావస్తున్నా పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంపై అధికారులు దృష్టిపెట్టలేదు. పంచాయతీ స్థలంలో ఉన్న పాత బోర్డు స్థానంలో కొత్త బోర్డు ఏర్పాటు చేసి, అందులో స్థల విస్తీర్ణం తొలగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ క్రమంలో పక్క స్థల యజమాని తన స్థలంలో కొద్ది రోజుల క్రితం ఎటువంటి అనుమతుల్లేకుండా సిమెంట్ దిమ్మలు కట్టడం ప్రారంభించగా విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు నిర్మాణం ఆపాలంటూ నోటీసు జారీచేయడంతో విషయం మరోమారు వెలుగులోకి వచ్చింది. పీఆర్ గెస్టుహౌస్ ఎదురుగా పంచాయతీ స్థలంలో మాయమైన 200 గజాల స్థలాన్ని స్థల యజమాని నుంచి స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెట్టాలని పలువురు సూచిస్తున్నారు. లేకుంటే రూ.2 కోట్ల విలువైన పంచాయతీ ఆస్తిని కోల్పోవలసి వస్తుందని వాపోతున్నారు. దీనిపై పంచాయతీ ఈఓ వర్మను వివరణ కోరగా.. పట్టణంలో పీఆర్. గెస్టుహౌస్ ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆనుకుని ఉన్న స్థలం యజమానికి ఇటీవల నోటీసు ఇచ్చామన్నారు. దీంతో ఆ యజమాని తన వద్ద ఉన్న డాక్యుమెంటును చూపించారన్నారు. లేఅవుట్ వేసిన వ్యక్తుల నుంచి మొదట్లో పంచాయతీకి కేటాయించిన 408 గజాల స్థలాన్ని రికార్డుపరంగా స్వాధీనం చేసుకున్న తరువాతనే పక్క స్థలం అమ్మకానికి ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉండగా.. ఇవేమీ పట్టించుకోకుండానే ఎన్‌ఓసీ ఇచ్చేశారన్నారు. దీనిపై పూర్తి విచారణ చేస్తామన్నారు. అలాగే తగ్గిపోయిన 200 గజాల పంచాయతీ స్థలాన్ని లేఅవుట్ వేసిన వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు.

గాంధీ జయంతి వేడుకల్లో ప్రొటోకాల్ వివాదం

» స్వచ్ఛతా హి సేవ ఫ్లెక్సీపై మునిసిపల్ చైర్‌పర్సన్ ఫొటోను ముద్రించని అధికారులు
» ఆర్డీవో సమక్షంలో కమిషనర్‌ను నిలదీసిన చైర్‌పర్సన్
» అధికారుల తీరుపై కలెక్టర్‌కు లిఖితపూర్వంగా ఫిర్యాదు



ఫ్లెక్సీలో తన ఫొటో ఎందుకు లేదని కమిషనర్‌ని నిలదీస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, అక్టోబరు 2 : గాంధీ జయంతి వేడుకల్లో ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. మునిసిపాలిటీ నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ఫ్లెక్సీ బ్యానర్‌లో తన ఫొటోను ముంద్రించకపోవడంతో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మనస్తాపానికి గురై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. పురపాలక సంఘం కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ మినీస్టేడియంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్డీవో వీవీ రమణ, చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వార్డు కౌన్సిలర్లను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన స్వచ్ఛతా హి సేవ ఫ్లెక్సీపై చైర్‌పర్సన్ ఫొటో లేకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ నిర్వహిస్తున్న కార్యక్రమం బ్యానర్‌పై తన ఫొటో ఎందుకు ముద్రించలేదని కమిషనర్‌ను నిలదీశారు. ఫ్లెక్సీపై స్థానిక ఎమ్మెల్యే ఫొటో మాత్రమే వేశారని, తన ఫొటో వేయకుండా అవమాన పరిచారని అన్నారు. ప్రొటోకాల్ పాటించని మునిసిపల్ కమిషనర్‌పై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తున్నానని చెప్పారు.

అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన తల్లీకుమార్తె

» ఏడు పతకాలు సాధించిన ఉపాధ్యాయురాలు నాగజ్యోతి, సాహితి
» ఆరు స్వర్ణాలు, ఒక కాంస్యం » నర్సీపట్నంలో సత్కారం



సాధించిన పతకాలతో నాగజ్యోతి, సాహితి

రోలుగుంట, అక్టోబరు 2: సింగపూర్, మలేషియాలో గత నెల 22 నుంచి 30వ తేదీ వరకు సంయుక్త భారతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ అంతర్జాతీయ క్రీడల పోటీల్లో రోలుగుంట జడ్పీ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు నాగజ్యోతి, ఆమె కుమార్తె సాహితిలు పాల్గొని 7 స్వర్ణ పతకాలు సాధించారు. సిమ్మింగ్‌లో 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగాల్లో సాహితి ప్రథమ స్థానంలో నిలిచి మూడు స్వర్ణ పతకాలు సాధించింది. అలాగే నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానంలో నిలిచి మూడు స్వర పతకాలు, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి ఒక వెండి పతకం మొత్తం నాలుగు పతకాలు సాధించారు. ఈ తలీకుమార్తెలు ఇద్దరూ ఇదివరకే ఎన్నో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని వివిధ పతకాలు సాధించారు.

ఈ సందర్భంగా బుధవారం నర్సీపట్నంలోని వాసవి కల్యాణ మండపంలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ పాల్గొని నాగజ్యోతి, సాహితిలను ఘనంగా సన్మానించారు.

బొజ్జన్నకొండ వద్ద లైటింగ్ అండ్ సౌండ్ షో ప్రారంభం



బొజ్జన్నకొండ వద్ద లేజర్ షోను ప్రారంభిస్తున్న ఎంపీ రమేశ్

తుమ్మపాల, అక్టోబరు 2 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ అండ్ సౌండ్ షోను కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ బుధవారం రాత్రి ప్రారంభించారు. బొజ్జన్నకొండ చరిత్రపై ప్రదర్శించిన లేజర్ షోను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ బొజ్జన్నకొండ చరిత్రను పర్యాటకులతో పాటు విద్యార్థులకు వివరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీపీవో శిరీషారాణి, ఎస్‌డీసీ ఎస్. సుబ్బలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

డొంకరాయిలో మొసళ్లు హల్‌చల్

» జలాశయం నుంచి బయటకు వచ్చిన మూడు మకరాలు



డొంకరాయి మెయిన్ డ్యామ్ వద్ద రోడ్డుపైకి వచ్చిన మొసలి

సీలేరు, అక్టోబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం వద్ద మొసళ్లు హల్‌చల్ చేశాయి. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో జలాశయం నుంచి మూడు మొసళ్లు బయటకు వచ్చాయి. అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగులు వాటిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. మూడింటిలో రెండు మొసళ్లు మళ్లీ జలాశయంలోకి వెళ్లిపోగా, ఒకటి మాత్రం డ్యామ్ రెండో నంబర్ గేటు సమీపంలో రోడ్డు ఉండిపోయింది. అధికారుల ఆదేశాలతో జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది మొసలిని జలాశయంలోకి పంపించారు. కాగా, జలాశయంలో మొసళ్లు అధికంగా ఉన్నాయని, తరచూ ఒడ్డుకు వస్తున్నాయని చేపల వేటను సాగించే జాలర్లు చెబుతున్నారు.

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2: కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో గురువారం నుంచి ఏడో తేదీ వరకు కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహించనున్నామని కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు తెలిపారు. ప్రతి రోజు రెండు నాటికలు ప్రదర్శిస్తారన్నారు. ఈ నాటిక పోటీలు మాజీ కౌన్సిలర్ కేఎం నాయుడు, మళ్ల సూరిబాబు, దేవాదుల శివాజీ తదితరుల పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు.

సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీ జరుగుతున్న దృశ్యం

పాయకరావుపేట, అక్టోబరు 2: స్థానిక శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణ)కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో సుమారు 100కి పైగా పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పోటీలను శ్రీప్రకాశ్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాశ్, ప్రో కబడ్డీ అఫీషియల్ పీవీఎస్‌వీ ప్రసాద్, బి.మురళీకుమార్, నేషనల్ వాలీబాల్ అసోసియేషన్ మెంబర్ మోహన్‌కుమార్, నేషనల్ వాలీబాల్ రిఫరీ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడా పోటీల పరిశీలకులు ఎల్.వెంకటరమణ, కె.హేమంత్‌కుమార్ రావు, వివిధ పాఠశాలల విద్యార్థినులు, కోచ్‌లు, మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష



దీక్షలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2: మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ నాయకులు బుధవారం నెహ్రూ చౌక్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు ఉపాధ్యాయులకు దండలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం కూడా మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న హెడ్‌మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. హెచ్ఎంల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఈవోలుగా నియమించాలన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ సత్యాగ్రహ దీక్షలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, మునిసిపల్ సంఘ నాయకులు అక్కునాయుడు, మాకిరెడ్డి రాజునాయుడు, బాషా, నాతవరపు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 97.33 శాతం పింఛన్లు పంపిణీ

అనకాపల్లి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ బుధవారానికి 97.33 శాతం పూర్తయిందని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,60,816 మంది లబ్ధిదారులుండగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారని తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు జిల్లాలో మొత్తం 2,53,985 (97.33 శాతం)మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించామన్నారు. స్థానికంగా ఉండకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇళ్లల్లో అందుబాటులో లేని 6,831 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

నేటి నుంచి ఉపమాకలో బ్రహ్మోత్సవాలు



ఉపమాక ఆలయంలో ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో స్వామి, అమ్మవారు

నక్కపల్లి, అక్టోబరు 2: మండలంలోని ఉపమాక క్షేత్రంలో గురువారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఆలయంలో ఏర్పాటు పూర్తి చేశారు. గురువారం రాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 4న పెద్ద పల్లకీపై తిరుపతి సేవ, ధ్వజారోహణం, 9న వసంతోత్సవం, గరుడసేవ, 10న పుణ్యకోటి వాహనంపై ఊరేగింపు, 11 రాత్రి మృగ వేట, 12న మధ్యాహ్నం వినోద ఉత్సవం, విజయదశమి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు చెప్పారు.

అది వన మహోత్సవ కార్యక్రమమే..

» ఇన్‌చార్జి డీఎఫ్‌వో సునీల్‌కుమార్

అనకాపల్లి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం సందర్భంగా కశింకోట మండలం బయ్యవరంలోని శారదా వనంలో కార్యక్రమాన్ని నిర్వహించామని, అది ప్రారంభోత్సవం కాదని జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జి డీఎఫ్‌వో సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా అటవీశాఖ అధికారులే శారదా వనాన్ని హడావిడిగా ప్రారంభించడాన్ని 'అటవీ అధికారుల ఇష్టారాజ్యం' శీర్షికన బుధవారం కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన జిల్లా అటవీశాఖాధికారి వివరణ ఇచ్చారు. శారదా వనంలో ముఖ ద్వారం నిర్మాణం, లోపల ఆవరణలో కొన్ని మొక్కలు మాత్రమే పెంచడం జరిగిందని తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా అటవీశాఖ ఉన్నతస్థాయి అధికారుల సూచనల మేరకు శారదా వనంలో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

నేడు ఎలమంచిలిలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ఎలమంచిలి, అక్టోబరు 2: నియోజకవర్గ కేంద్రం ఎలమంచిలి పట్టణంలోని కొమ్మాయి గుండం వద్ద గురువారం అన్న క్యాంటీన్ భవనాన్ని ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు మునిసిపల్ అధికారులు పూర్తి చేశారు.


అనకాపల్లి జోనల్ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ అయ్యప్పనాయుడు , టీడీపీ నేత రత్నాకర్ తదితరులు



పరవాడలో గాంధీ చిత్రపటం వద్ద సింహాద్రి ఎన్టీపీసీ ఓఅండ్ఎం విభాగం జీఎం ఎస్‌జే డేవిడ్ తదితరుల అంజలి


సబ్బవరం మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి


ఎలమంచిలి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గాంధీజీ చిత్రపటం వద్ద ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్ల నివాళి

జాతిపితకు జేజేలు

▸ వాడవాడలా ఘనంగా గాంధీ జయంతి ▸ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు

▸ పలుచోట్ల 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా కార్యాలయాల ఆవరణలు, రోడ్లు, కాలువలను శుభ్రపర్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు


పాయకరావుపేట మండలం గుంటపల్లిలో గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాల వేస్తున్న గెడ్డం ఆకాశ్



అనకాపల్లిలోని శంకరం ఫ్లైఓవర్ వంతెనను శుభ్రం చేస్తున్న కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే.., 'పేట' కాలువలో పూడిక తీస్తున్న అధికారులు


రాంబిల్లిలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నూకన్నదొర, జనసైనికులు గాంధీ విగ్రహం వద్ద నివాళులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2 : మహాత్ముని స్ఫూర్తితో అంతా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో బుధవారం గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా మహాత్ముని విగ్రహానికి, శాస్త్రి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలతో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కూటమి నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కొణతాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలో వాడవాడలా గాంధీ జయంతిని జరిపారు. జీవీఎంసీ కార్యాలయం వద్ద మహాత్ముని విగ్రహానికి జడ్పీ అయ్యప్పనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మహాత్ముని చిత్రపటానికి మాజీ ఎంపీ సత్యవతి, దంతులూరి దిలీప్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బి.అప్పారావు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీనగరం మెయిన్‌రోడ్డుపై గల మహాత్ముని విగ్రహానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు కాళ్ల వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు అంజలి ఘటించారు. సబ్‌జైలులో సూపరింటెండెంట్ వైఎస్ గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని జరిపారు.

కొత్తూరు : ఇక్కడి జనసేనకార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వీరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి వీరు అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే, అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో సీఐ జి.అశోక్‌కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు స్టేషన్ ఆవరణను తీర్చిదిద్దారు. రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ సత్యనారాయణ, ఏఎస్‌ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతిని జరిపారు. ఎంపీడీవో ఎ.రవికుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఈవో రమేష్ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట : గాంధీ జయంతి సందర్భంగా ఇక్కడి పాత పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. వార్డు మెంబరు మలిపెద్ది వెంకటరమణ, టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు లెక్కల గోవింద్, పల్లా విలియం కేరీ, జూరెడ్డి ప్రసాద్, దువ్వ శ్రీనివాస్, పేర్రాజు, డి.నాగు, కె.సత్తిబాబు, దొంగల శ్రీను, కట్టా శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్ : గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గుంటపల్లి, నామవరంలలో జనసేన యువ నాయకులు గెడ్డం ఆకాశ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పల్లి దుర్గ, పెద్ద తదితరులు పాల్గొన్నారు. అలాగే, మంగవరంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వంగలపూడి రామారావు, కట్టా దొర, దేవవరపు రాజేశ్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కోటవురట్ల జంక్షన్ వద్ద గల ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణలో గాంధీజీ విగ్రహానికి ఎంపీడీవో కాశీవిశ్వనాథం, తహసీల్దార్ తిరుమలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పి.సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : గాంధీ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇక్కడి మునిసిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, అధికారులు, పాలకవర్గ సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్మాయి గుండం వద్ద, కొక్కిరాపల్లి వార్డుల్లో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఎంపీడీవో కొండలరావు ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే, రైల్వే స్టేషన్ రోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సేవా సంఘం ప్రతినిధులు, వైసీపీ నేతలు, టీడీపీ నేతలు వేర్వేరుగా నివాళులర్పించారు. మునిసిపల్ అధికారులు డీఈ వీరయ్య, టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీను, నాయకులు దాసరి కుమార్, దూది నరసింహమూర్తి, రాపేటి సంతోష్, మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గాంధీ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మోసయ్యపేటలో ఆయన విగ్రహానికి టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. పూడి ఆర్ ఆర్ కాలనీలో వంద మంది యుకులు రక్తదానం చేశారు. ఏయూ ఆదేశాల మేరకు అచ్యుత డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గొర్లె ధర్మవరంలో గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ జయంతిని జరిపారు. రాంబిల్లి హైస్కూల్‌లో జనసేన మండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, మండల ప్రధాన కార్యదర్శి చోడిపల్లి ప్రసాద్, ఎరుపల్లి నాగరాజు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా హరిపురంలోని సందప కేంద్రం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, సర్పంచ్, బుజ్జి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రంగనాయకులు పారిశుధ్య కార్మికులను సత్కరించారు. మూలజంపలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్, ఎంపీటీసీ అల్లవరపు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ వేగి రాము, సచివాలయం సిబ్బంది తదితరులు గాంధీజీ జయంతి జరిపారు.

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్ సంగమ్ హాల్‌లో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎన్టీపీసీ ఓ అండ్ఎం విభాగం జీఎం ఎస్‌జే డేవిడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. సింహాద్రిలోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.అప్పారావు, పోలీసు స్టేషన్‌లో సీఐ పిన్నింటి రమణ, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేశారు. ఎంపీడీవో పి.పద్మజ, ఏవో శివరామప్రసాద్, ఆర్ఐ వీరయ్య, ఎంపీటీసీ గొర్లి కనకరాజు, బోకం రామునాయుడులతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : కలెక్టర్

అనకాపల్లి టౌన్ : పక్షం రోజులుగా జరుగుతున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. గాంధీ జయంతి వేడుకల అనంతరం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలు ఇక్కడి సబ్బవరం రోడ్డులోని శంకరం ఫ్లైఓవర్ వంతెనకు వెళ్లి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. చీపుర్లు చేతబట్టి వంతెనపై నడక మార్గాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు అంతా ప్రాధానం ఇవ్వాలన్నారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, పారిశుధ్య విభాగం సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట,/రూరల్ : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎంపీడీవో జయప్రకాశరావు తదితర అధికారులతో కలిసి రోడ్లపై చెత్తా చెదారాన్ని తొలగించడంతో పాటు కాలువల్లో పూడిక తీసే పనులు చేపట్టారు. అనంతరం సంపద కేంద్రం వద్ద పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈవోపీఆర్‌డీ చంద్రశేఖరరావు, పంచాయతీ ఈవో వర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, గారా ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని తిమ్మాపురం పంచాయతీ శివారు కోనవానిపాలెంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన సీనియర్ నాయకులు కోన అప్పలరాజు, సేనాపతి బాబూరావు గ్రామంలో చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. కూటమి నాయకులు వంగలపూడి గోవింద్, మామిడి నాగరాజు, డి.సత్యనారాయణ, కోన గురాచార్యులు, కోన దుర్గాప్రసాద్, కోన లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పిలుపునిచ్చారు. పరవాడలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత హీ సేవలో భాగంగా సంతబయలు ఉద్యోగులు, అంగన్‌వాడీ, సచివాలయ ఉద్యోగులు చీపుర్లు చేతబట్టి రోడ్లను శుభ్రం చేశారు. తొలుత పరవాడ సచివాలయంలో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి'


సబ్ జైలులో ఖైదీల దినోత్సవంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి: ప్రతి ఒక్కరూ అహింసావాదాన్ని ఎంచుకుని సన్మార్గంలో నడవాలని సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఎలమంచిలి సబ్ జైలు ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాట్లాడుతూ సబ్ జైలులో ఉన్న వారంతా క్షణికావేశాలకు లోను కాకుండా మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు. అంతకు ముందు ఏజీపీ వెంకట్రావు, ప్యానెల్ న్యాయవాదులు పెరుమాళ్ల వెంకటరమణ ఖైదీలకు పలు సూచనలు చేశారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు

కొత్తూరు, అక్టోబర్ 2 : అనకాపల్లి మండలంలోని గ్రామీణ ప్రాంతాలు, కశింకోట, మునగపాక మండలాల్లో కొత్త మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌నాయుడు బుధవారం తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనకాపల్లి గ్రామీణ ప్రాంతంలో ఐదు, కశింకోట మండలంలో ఆరు, మునగపాక మండలంలోని నాలుగు షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. కాగా, ఈ నెల 11వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి అనకాపల్లిలోని పాత బస్టాండ్ పక్కన ఉన్న ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో లాటరీ విధానంలో ఎంపిక చేస్తామని వివరించారు.

సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వ నూతన ఎక్సైజ్ పాలసీ గెజిట్ నోటిఫికేషన్ మేరకు సబ్బవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సబ్బవరంలో ఎనిమిది, పరవాడ మండలంలో పదకొండు మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన అనకాపల్లిలోని ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఏయూలో కొత్త కోర్సులు

... 5వ పేజీ తరువాయి

ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తెలిపారు. నూతనంగా ప్రారంభించబోయే కోర్సులతో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందునే వర్సిటీలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఇతర కోర్సులపై కూడా అధ్యయనం చేస్తున్నామని, వాటికి ఉన్న డిమాండ్, విద్యార్థులు చేరేందుకు గల అవకాశాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకువస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.

136 మద్యం షాపులు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి మండలంలో 5, పరవాడలో 11, అచ్యుతాపురంలో 9, మునగపాకలో 4, కశింకోటలో 6, సబ్బవరంలో 8, నర్సీపట్నం మునిసిపాలిటీలో 7, నర్సీపట్నం మండలంలో 3, రోలు గుంటలో 3, కోటవురట్లలో 4, మాకవరపాలెంలో 4, నాతవరంలో 4, గొలుగొండలో 4, ఎలమంచిలి మునిసిపాలిటీలో 4, ఎలమంచిలి మండలంలో 3, రాంబిల్లిలో 4, చోడవరంలో 8, కె.కోటపాడులో 5, దేవరాపల్లిలో 4, బుచ్చెయ్యపేటలో 5, పాయకరావుపేటలో 6, నక్కపల్లిలో 5, ఎస్.రాయవరంలో 7, మాడుగులలో 5, చీడికాడలో 3, రావికమతం మండలంలో 5 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం మద్యంపై విధించిన 10 రకాల పన్నులను ఆరింటికి తగ్గించారు. అంతే కాకుండా క్వార్టర్ మద్యం రూ.99కే అందుబాటులో ఉంచనున్నారు. కాగా జిల్లాలో తొలిరోజు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

▸ వీధివీధినా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలు ▸ ఎటు చూసినా కోలాహలం


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

పరవాడ, అక్టోబరు 2 : శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలో పలుచోట్ల మండపాలు ముస్తాబయ్యాయి. దుర్గమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు యువజన సంఘాలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోటాపోటీగా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా పరవాడ, లంకెలపాలెం, ఈ.బోనంగి, బొద్దపువానిపాలెం, గొర్లివానిపాలెం, తానాం, వాడ చీపురుపల్లి, వెన్నెలపాలెం, దేశపాత్రునిపాలెం, కలపాక, పి.బోనంగి, గౌతులచ్చన్ననగర్, పెదముషిడివాడ, మంత్రిపాలెం, సాలాపువానిపాలెం, భరిణికం, తాడి తదితర ప్రాంతాల్లో మండపాలు రూపుదిద్దుకున్నాయి. ప్రతి వీధి విద్యుద్దీపాలంకరణతో ధగధగలాడుతున్నాయి.

అచ్యుతాపురం : హరిపాలెంలోని అందలాపల్లి కొండపై కొలువుదీరిన భగీరథి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇక్కడ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేవీ నిర్మాణాల్లో కాంట్రాక్టు కార్మికులను గుర్తించాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన

రాంబిల్లి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): నేవీ చేపట్టిన నిర్మాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద పలువురు కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యునియన్ గౌరవాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ ఇక్కడ ఎన్‌ఏవోబీ నిర్మాణ పనులు గత 14 సంవత్సరాలుగా జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇందులో ఎల్అండ్‌టీ, ఐటీడీసీ, ఎస్ఎల్‌సీ, కేకేఆర్, కేఈసీ వంటి అనేక సంస్థలు ఈ పనులు చేపడుతుండడంతో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరు రోజుకు 12 గంటలు పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదని, అదనపు పనికి ఓటీ ఇవ్వడం లేదని, సంవత్సరం పూర్తి చేసుకున్న కార్మికులకు బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మిక సమస్యలు పరిష్కరించాలిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్.నారాయణరావు, వై.రాము, ఎన్‌ఏవోబీ కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కార్మిక సంఘాల దీక్ష


రిలే దీక్షలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2 : స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలని కోరుతూ బుధవారం నెహ్రూచౌక్‌లో కార్మిక సంఘాల నాయకులు రిలే దీక్ష నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బాలేపల్లి వెంకటరమణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దశల వారీగా ప్రైవేటుపరం చేయడంతో పాటు మూసివేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఉత్పత్తి నిలిపి వేయడం చూస్తుంటే పరోక్షంగా స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయాలనే కుట్ర జరుగుతుందన్న అనుమానాన్ని వారు వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాలను మరుగునపెట్టే విధంగా వ్యవహరిస్తుండడం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు తగదన్నారు. ఈ దీక్షా శిబిరంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట వేదిక కన్వీనర్ రుత్తల శంకరరావు, కో-కన్వీనర్ ఆర్.దొరబాబు, సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు వైఎన్ భద్రం, పి.సత్యనారాయణతో పాటు సంయుక్త కిసాన్‌మోర్చ నాయకుడు గాడి బాలు, న్యాయవాది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాల ప్రదర్శన ప్రారంభం


ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేస్తున్న ఎంపీ సీఎం రమేష్

కొత్తూరు, అక్టోబర్ 2 : పట్టణంలోని నెహ్రూచౌక్ కూడలిలో ఏర్పాటు చేసిన ఖాదీ వస్త్రాల ప్రదర్శనను ఎంపీ, పార్లమెంటు రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సీఎం రమేష్ బుధవారం ప్రారంభించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం : సీఐ


మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

తుమ్మపాల, అక్టోబరు 2 : శారదావేలీ డెవలప్‌మెంట్ సమితి వార్షికోత్సవాన్ని బుధవారం తుమ్మపాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగం వల్ల లాభాలను వివరించారు. లుపిన్ ఫార్మా కంపెనీ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌వీడీఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి సమగ్రశిక్ష ఉద్యోగుల వినతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2 : ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో గల గాంధీ విగ్రహానికి విద్యాశాఖ సమగ్రశిక్ష ఉద్యోగులు బుధవారం సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. బకాయి జీతాలు చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలన్న పది హేను డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఏపీ సమగ్రశిక్ష ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నియోజకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెడుగుడు పోటీలు

ఎలమంచిలి, అక్టోబరు 2 : జంపపాలెంలో మరిడిమాంబ అమ్మవారి జాతరను పురస్కరించుకుని జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను సర్పంచ్ ఎస్.దేవకి ప్రారంభించారు. మూడు రోజులపాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఈ పోటీలు జరగనున్నాయన్నారు. టోర్నీ నిర్వాహకులు టిక్కా తాతారావు, పిల్లా కుమార్, ఎస్.శ్రీను తదితరులు తెలిపారు.

ఉచిత కాశీయాత్ర ప్రారంభం


యాత్రను ప్రారంభిస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 2 : మండలంలోని పాల్తేరు గ్రామం నుంచి మంగళవారం రాత్రి హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు సహకారంతో దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు వందమంది భక్తులు ఉచిత కాశీ యాత్రకు బయల్దేరి వెళ్లారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమ నిర్వాహకులు సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ ఈ యాత్రను ప్రారంభించారు. తొలుత కాశీ క్షేత్రం మహత్యాన్ని వివరించారు. జనసేన నాయకులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, దేవవరపు వెంకటరమణ, శ్రీను, దేవవరపు గోవింద్, విశ్వనాథుని వెంకటేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శాకాహార సద్భావన ర్యాలీ



సద్భావన ర్యాలీలో ఎమ్మెల్యే కొణతాల తదితరులు

తుమ్మపాల, అక్టోబరు 2 : అనకాపల్లి పట్టణంలోని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ శాకాహారాన్ని అలవర్చుకుని తద్వారా ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2 : పట్టణంలోని బాలకృష్ణ బస్టాప్ వద్ద ఓ వ్యక్తి నుంచి ఎనిమిది క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకుని మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బోకం రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఎరుకువానిపాలెం గ్రామానికి చెందిన మడక సురేష్‌కుమార్ మద్యం షాపులో బాటిళ్లు కొనుగోలు చేసి వెళుతుండగా బస్టాప్ వద్ద అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేశారు. ఎనిమిది క్వార్టర్ బాటిళ్ల లభ్యం కావడంతో కేసు నమోదు చేశారు.

గాంధీజీకి ఘన నివాళి

» వాడవాడలా జాతిపిత జయంతి » పలు చోట్ల స్వచ్ఛతా హీ సేవా



బుచ్చెయ్యపేటలో గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్ విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు

మహాత్మా గాంధీ జయంతిని వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతిపిత గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఆయన అడుగుజాడలు అనుసరణీయం అంటూ పిలుపునిచ్చారు.

నర్సీపట్నం, అక్టోబరు 2 : పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఆర్డీవో వీవీ రమణ, చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నర్సీపట్నం అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు, బలిఘట్టంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చోడవరం : పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌లో జాతిపితకు ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె.రమణాజీ, లెక్చరర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక సబ్‌జైలును సందర్శించిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఖైదీలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గవరవరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం జీజే సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందిరా పార్కు వద్ద గాంధీ విగ్రహం వద్ద, లక్ష్మీపురం వాకర్స్‌క్లబ్ వద్ద గాంధీ జయంతి వేడుకల్లో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, జగ్గారావు,స్థానిక ప్రముఖులు కాండ్రేగుల డేవిడ్, పీఎస్‌కే గుప్తా, రిటైర్డ్ సీఐ యూవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్, లెక్చరర్లు పాల్గొన్నారు. స్థానిక వికాస కేంద్రం వద్ద యోగా స్కిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పి.రమణమూర్తి, అప్పారావు, అర్రెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాతవరం : చెర్లోపాలెంలో నర్సీపట్నం నియోజకవర్గం జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో జనసేన నేతలు, నాతవరం పంచాయతీ వద్ద సిబ్బంది, బీజేపీ నాయకులు బుల్లిదొర గాంధీజీకి నివాళులు అర్పించారు. గునుపూడిలో కూడా గాంధీజీ జయంతి నిర్వహించారు.

గొలుగొండ : తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, గ్రామ సచివాలయాల వద్ద గాంధీజీకి అధికారులు నివాళులు అర్పించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏవో సత్యనారాయణ, ఈవోపీఆర్డీ రత్నకుమారి, రఘురాం, వీఆర్వోలు, కార్యదర్శులు,హెచ్‌ఎం ఆనంద్, సర్పంచ్‌లు మామిడి ఆదిలక్ష్మి, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో గల గాంధీజీ విగ్రహానికి పలువురు అధికారులు, నాయకులు, పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లోచల సుజాత, స్థానిక వాసవీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దరిశి ప్రసాద్, జాతీయ అల్లూరి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి భాస్కరమణి, ఏఎస్ఐ నూకరాజు, విరామ హెచ్‌ఎం చింతల అచ్చిరాజులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండల కేంద్రంలో గాంధీ జయంతిని ఆర్యవైశ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మాకవరపాలెం పంచాయతీ కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి తహసీల్దార్ ఎం.ప్రసాద్‌రావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో బాలదొర, ఉప సర్పంచ్ లాలం రాము, బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు, వీఆర్వో సూర్యనారాయణ మాకవరపాలెం ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట, వడ్డాది, కోమళ్లపూడి, కందిపూడి వడ్డాది-కొత్తూరులో గాంధీజీకి పలువుర నివాళులు అర్పించారు. బుచ్చెయ్యపేటలో తహసీల్దార్ ఎం.లక్ష్మి, హెచ్‌డీటీ మురళీధరరావు, ఈవోపీఆర్డీ వి.లక్ష్మి,సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సర్పంచ్ సుంకర లక్ష్మి పాల్గొన్నారు.

రావికమతం : మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.వెంకటరమణ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రావికమతం సంపద తయారీ కేంద్రంలో పారిశుధ్య కార్మికులతో కలసి ఎంపీడీవో వెంకన్న బాబు, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాస్,కార్యదర్శి పి.సత్యారావు,సిబ్బంది గాంధీజీకి ఘనంగా నివాళు అర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బి.వెంకటరమణ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు.

మాడుగుల : స్థానిక గాంధీ పార్కులో గాంధీజీ విగ్రహానికి మండల పరిషత్ కార్యాలయం సిబ్బందితో పాటు పలువురు నేతలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

మాడుగుల రూరల్ : కింతలి వల్లాపురంలో గాంధీజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ సచివాలయాలల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, రాంబాబు, భీమన్నదొర, సోమన్నదొర, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్డీవో వీవీ రమణ, చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

రోలుగుంట : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ రామమూర్తి, మండల సర్వేయర్ నాయుడు, వీఆర్వోలు తదితరుల ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొవ్వూరు వృద్ధాశ్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, కార్యదర్శి యర్రంశెట్టి రాజారావు, సర్పంచ్ కాంతమ్మల ఆధ్వర్యంలో, కొండపాలెంలో మండల కాపునాడు అధ్యక్షుడు బంటు రమణ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించి గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలోని రామాలయం వద్ద గాంధీ విగ్రహానికి ఎంపీపీ బుల్లి లక్ష్మి, ఎంపీడీవో సువర్ణరాజు, జడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కార్యదర్శి రత్నం తదిరులు పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందజేశారు. బి.కింతాడలో సర్పంచ్ బాబూరావు, గర్నింగిలో సర్పంచ్ గూడెపు రాము రోడ్లను శుభ్రం చేశారు. మారేపల్లిలో కోటిపల్లినాయుడు, కిల్లి గోవింద, తామరబ్బలో, రైవాడలో చల్లా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : చీడికాడ, తురువోలు, జేబీ పురం, ఖండివరం, అప్పలరాజుపురం గ్రామాలతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్ముడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. చీడికాడలో సర్పంచ్ గాలి సామాలమ్మ, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, జెబి.పురంలో వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేటి నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు



పూలతో అలంకరణలో దేవి

నర్సీపట్నం, అక్టోబరు 2 : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు దేవదాయ శాఖ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం కలశ స్థాపనతో ప్రారంభించి 13న ఉత్సవ విగ్రహ నిమజ్జనంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఆలయానికి, మెయిన్ రోడ్డులో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు అమ్మవారి ఆలయ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు తొమ్మిది అలంకరణలతో అమ్మవారు దర్శనమిస్తారు.

మాడుగుల : మాడుగుల కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారిని అలంకరించారు. ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



నాతవరం : మండల కేంద్రంలోని శ్రీశక్తి పంచాయతన ఆలయం ప్రాంగణంలో ఉన్న కనకదుర్గ ఆలయం వద్ద అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయదర్మకర్త శెట్టి సతీష్ తెలిపారు. ప్రతిరోజు కనకదుర్గ ఆలయం వద్ద కుంకుమపూజ, అలాగే చండీయాగం నిర్వహిస్తామని తెలిపారు. దసరా ఉత్సవాల చివరి రోజు కనకదుర్గ ఆలయం వద్ద అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తామని సతీష్ తెలిపారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కనకదుర్గ ఆలయాన్ని విద్యుత్‌దీపాలంకరించారు.

వెంకన్నపాలెంలో పోషణమాసోత్సవాలు



పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, అక్టోబర్ 2 : మండలంలోని వెంకన్నపాలెంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పోషణమాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యం గురించి సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుతి రమణ, జనసేన నాయకులు సియ్యాద్రి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి : ఎంపీపీ

మాడుగుల : సమస్యలు పరిష్కరించే దిశగా ప్రతీ ఒక్కరూ కలసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం అన్నారు. స్థానిక పాలకేంద్రంలో సర్పంచ్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సతీష్, రొబ్బా మహేష్, శ్రీనాథ ప్రసాదరావు, విజయ్ తదితరులు మాట్లాడుతూ గ్రామంలోని పలు సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి కార్యవర్గం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ రాజారాం మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. అంతకుముందు.. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆరుగురిని సన్మానించారు. కార్యక్రమంలో జవాద్ది వరహాలు, దేవరాపల్లి శ్రీనివాసరావు, వడ్డాది రంజిత్, లెక్కల కాశీబాబు, సూర్యనారాయణరాజు, పుప్పాల రమేష్, పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

20 వేల విత్తన బంతులు అందజేత

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 2 : ఆయుష్మాన్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్‌కు 20 వేలు విత్తన బంతులను అందజేశారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వీటిని అందజేశారు. నర్సీపట్నం చుట్టుపక్కల ఉన్న 26 వాసవీ క్లబ్‌లు ద్వారా 1.5 లక్షలు విత్తన బంతులు తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం చెట్టు లేని చోట విత్తన బంతులు చల్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలగానారాయణరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పలువురు వీఆర్వోలు బదిలీలు

రోలుగుంట, అక్టోబరు 2 : మండలంలోని పలువురు వీఆర్వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.గ్రేడ్-1 వీర్వోలుగా ఉన్న కుసర్లపూడి గ్రామ వీఆర్వో బోడసకూర్తి శ్రీనివాసరావును రావికమతం మండలం కొత్తకోట-2కు, నిండుగొండ వీఆర్వో ఎ.దుర్గాశంకర్‌ను రావికమతంకు, జగ్గంపేట వీఆర్వో కె.బుల్లిబాబును ఎల్.కొత్తకోట, బుచ్చెంపేట వీఆర్వో ప్రసాద్‌ను గర్నికం, ఎంకేపట్నం వీఆర్వో పి.రాజులమ్మను రోలుగుంట, కొండపాలెం వీఆర్వో కె.చెల్లయ్యమ్మను గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం, కొమరవోలు వీఆర్వో ఎ.శ్రీనివాసరావును చినపాచిల, రోలుగుంట వీఆర్వో షేక్ సన్యాసి సాహెబ్‌ను చెట్టుపల్లి-1, కొంతలం వీఆర్వో రామచంద్రుడును కుసర్లపూడి, గుండుబాడు వీఆర్వో ఎం.నాగమణిని కొవ్వూరు గ్రామ వీఆర్వోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మౌనిక



కృష్ణాదేవిపేట, అక్టోబరు 2 : గొలుగొండ మండలం చోద్యం హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పి.మౌనిక రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీ లకు ఎంపికైనట్లు హెచ్‌ఎం,శ్రీనివాసరావు, కె. నూకరాజు తెలిపారు.

9 మద్యం సీసాలు స్వాధీనం

రావికమతం, అక్టోబరు 2 : పాన్‌షాపులో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతడి నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఎంపీ సీఎం రమేష్‌కు అభినందనలు



ఎంపీ రమేశ్‌కు అభినందిస్తున్న చోడవరం ఎమ్మెల్యే రాజు తదితరులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 2 : రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను బుధవారం చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, కూటమి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, కూటమి నాయకులు గేదెల సత్యనారాయణ, దాడి సూర్యనాగేశ్వరరావు, దొండా సన్యాసిరావు, దేవర అప్పారావు, డొడ్డి కిషోర్, డొంకిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లి వచ్చిన ఎంపీ సీఎం రమేష్‌నుబుధవారం స్టేట్ బీజేపీ కౌన్సిలర్ గల్లా రాజేశ్వరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దేవరాపల్లి : రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ హోదాలో విశాఖపట్నం వచ్చిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను మండలంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ కృష్ణమూర్తి, పెద్దాడ వెంకటరమణ, చల్లా తాతయ్యలు, గొర్లె దేముళ్లు, చల్లా నానాజీ, రాజినాయుడు, మాలిబాబు తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు

నర్సీపట్నం, అక్టోబరు 2 : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 21 మద్యం దుకాణాలు ఏర్పాటుకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మునిసిపాలిటీలో ఏడు, రూరల్‌లో మూడు, రోలుగుంటలో 3, కోటవురట్లలో నాలుగు, మాకవరపాలెంలో నాలుగు షాపులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఒక్కొక్క దరఖాస్తుకి రూ.2లక్షలు చలానా తీయాల్సి ఉంటుంది, నర్సీపట్నం మునిసిపాలిటీ, కోటవురట్ల, మాకవరపాలెంలో మద్యం దుకాణాలు ఒక సంవత్సరం కాల పరిమితికి లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలు, నర్సీపట్నం రూరల్, రోలుగుంటలో రూ.50 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రెండో ఏడాది 10 శాతం అదనంగా లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చోడవరం : స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోడవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలోని 22 మద్యం దుకాణాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ కేవీపీ పాపునాయుడు చోడవరం మండలంలో 8 దుకాణాలు, కె.కోటపాడులో 5, దేవరాపలిలో 4, బుచ్చెయ్యపేటలో 5 దుకాణాలకు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

గొలుగొండ : గొలుగొండ, నాతవరం మండలాలకు సంబంధించి మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎస్ఐ రహీం తెలిపారు. పూర్తి వివరాల కోసం గొలుగొండ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

6 నుంచి విధుల బహిష్కరణ

» కమ్యూనిటీ ఆస్పత్రి కార్మికుల హెచ్చరిక

చోడవరం, అక్టోబర్ 2 : స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకుడు కోన లక్ష్మణ డిమాండ్‌చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళనలో భాగంగా 32వ రోజైన బుధవారం పారిశుధ్య కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 6 నుంచి విధులు బహిష్కరిస్తామని లక్ష్మణ హెచ్చరించారు.

గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ వినతిపత్రం



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు సుబ్బన్న

నర్సీపట్నం, అక్టోబరు 2 : బీజేపీ నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని ఆరోపిస్తూ డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న గురువారం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంగిన రమణ, సిద్ధ పాల్గొన్నారు.

గాంధీకి సమగ్రశిక్ష ఉద్యోగులు వినతి

నర్సీపట్నం, అక్టోబరు 2 : సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు మహాత్మా గాంధీ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. సమ్మె కాలం నాటి హామీలు నెరవేర్చాలని, ఆగస్టు, సెప్టెంబరు నెల జీతాల బకాయిలు చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూడి వెంకట్రావు, పట్నాల సతీష్, ఎ.వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెగా శిబిరంలో 680 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎంపీ సీఎం రమేష్, తాతయ్యబాబు తదితరులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 2 : వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్ మైదానంలో బుధవారం అమ్మ హెల్పింగ్ హార్ట్స్ గ్రామీణ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ ఏడాది 680 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు వందేమాతరం బ్లడ్ బ్యాంకు ఛైర్మన్, ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త వినోదబాలు తెలిపారు. శిబిరంలో ప్రత్యేకంగా ప్రదర్శించిన వివిధ దేవతామూర్తుల వేషధారణలు, జానపద నృత్యాలు,బాడీ బిల్డింగ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ శిబిరంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ తెలుగురైతు ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జీ పీవీఎస్ఎన్ రాజు, విశాఖ డెయిరీ ఛైర్మన్ గేదెల సత్యనారాయణ టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, జడ్పీటీసీ దొండా రాంబాబు, ఎస్ఐ శ్రీనివాసరావు, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, సంస్థ సభ్యులు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, దొండా నరేష్, దొండా గిరిబాబు, సింగంపల్లి రమేష్ తదితరులు సందర్శించారు. రక్తదాతలతో పాటు కళాకారులను అభినందించారు. వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లులు అందజేశారు.

మండల ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ చినమాణిక్యంకు సన్మానం



చినమాణిక్యంకు సన్మానిస్తున్న ఎంపీ రమేశ్, కలెక్టర్ జయకృష్ణన్, ఎమ్మెల్యేలు బండారు, కొణతాల, సుందరాపు తదితరులు

రావికమతం, అక్టోబరు 2 : మండల ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ (హరితరాయబారి)గా ఎంపికైన గర్నికం గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ వాలిశెట్టి చిన మాణిక్యంను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. గత నెల 17న ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం నుంచి అక్టోబరు రెండు గాంధీ జయంతి వరకూ గ్రామ పంచాయతీల్లో ఉత్తమ సేవలు అందించిన గ్రీన్ అంబాసిడర్‌లను జిల్లాలో ఎంపిక చేశారు. ఇందులో భాగంగా గర్నికం పంచాయతీలో చినమాణిక్యం ఎంపికయ్యారు. గాంధీ జయంతి సందర్భంగా అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ రమేశ్, ఎమ్మెల్యేలతో పాటు జిల్లా కలక్టర్ తదితరులు మాణిక్యంను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఈవోపీఆర్డీ శ్రీనివాస్, కార్యదర్శి స్వామి తదితరులు మాణిక్యంను అభినందించారు.

ఈ గట్టుపై ప్రయాణం సాహసమే..

» గోతులు, బురదమయంగా రైవాడ జలాశయం గట్టు



గోతులు, బురదమయంగా తయారై భీతిగొల్పుతున్న రైవాడ జలాశయం గట్టు

దేవరాపల్లి, అక్టోబరు 2 : మండలంలోని రైవాడ జలాశయ గట్టు వర్షాల దెబ్బకు గొయ్యిలు ఏర్పడి వాటిల్లో నీరు చేరడంతో బురదమయంగా మారిపోయింది. జలాశయం మొత్తం 5.5 కిలో మీటర్లు పొడవు ఉంటుంది. ఈ గట్టు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో తుప్పలు పెరిగిపోయాయి. గతంలో పర్యాటకులు వెళ్లే వారు. గట్టు అధ్వానంగా మారడంతో ఎవరూ అటు వైపు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. అంతేకాకుంగా గతంలో గట్టు మీదగా తామరబ్బ, చింతలపూడి, పంచాయతీ ప్రజలు దేవరాపల్లి నిత్యావసరాలకు వెళ్లేవారు. అలాగే అనంతగిరి, ఎస్.కోట, అరకు వెళ్లే వారంతా గట్టు మీదుగా వెళ్లేవారు. నాలుగు కిలోమీటర్లు దగ్గరగా ఉండేది. కానీ ఈ గట్టుపై పెద్ద గొయ్యలు పడడంతో ఆరు కిలోమీటర్లు ఇటుగా వెళ్లే సాహసం ఎవరూ చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు జలాశయ గట్టును పటిష్టం చేసి, గోతులను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

జేబీ పురంలో స్వచ్ఛతా హీ సేవ



శ్రమదానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చీడికాడ, అక్టోబరు 2 : స్వచ్ఛభారత్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీవో కామేశ్వరరావు అన్నారు.స్వచ్ఛత హీ సేవలో భాగంగా వరహాపురం కాటా నుంచి పెదగోగాడ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా అధికారులు, జేబీ పురం గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు బుధవారం శ్రమదానం చేశారు. చెత్తాచెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, మాజీ సర్పంచ్ గొల్లవిల్లి రాజబాబు, ఎంపీడీవో కార్యాలయం సూపర్‌వైజర్ డి.కామేశ్వరరావు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

136 మద్యం షాపులు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి మండలంలో 5, పరవాడలో 11, అచ్యుతాపురంలో 9, మునగపాకలో 4, కశింకోటలో 6, సబ్బవరంలో 8, నర్సీపట్నం మునిసిపాలిటీలో 7, నర్సీపట్నంమండలంలో 3, రోలుగుంటలో 3, కోటవురట్లలో 4, మాకవరపాలెంలో 4, నాతవరంలో 4, గొలుగొండలో4, ఎలమంచిలి మునిసిపాలిటీలో 4, ఎలమంచిలి మండలంలో 3, రాంబిల్లిలో 4, చోడవరంలో 8, కె.కోటపాడులో 5, దేవరాపల్లిలో 4, బుచ్చెయ్యపేటలో 5, పాయకరావుపేటలో 6, నక్కపల్లిలో 5, ఎస్.రాయవరంలో 7, మాడుగులలో 5, చీడికాడలో 3, రావికమతం మండలంలో 5 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు.

గతంలో వైసీపీ ప్రభుత్వం మద్యంపై విధించిన 10 రకాల పన్నులను ఆరింటికి తగ్గించారు. అంతే కాకుండా కార్టర్ మద్యం రూ.99కే అందుబాటులో ఉంచనున్నారు. కాగా జిల్లాలో తొలిరోజు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు.

ప్రైవేటు విద్యాసంస్థలపై ఆర్డీవోకు ఫిర్యాదు

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 2 : సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు తెరచి విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో వీవీ రమణకు ఫిర్యాదు చేశారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఇందుకు నిరసనగా ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జనార్థన్, రాజు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు దుర్గాభవానీ



నాతవరం, అక్టోబరు 2 : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు స్థానిక బాలికల వసతిగృహంలో ఉంటూ నాతవరం హైస్కూల్‌లో చదువుతున్న కోసూరి దుర్గాభవానీ ఎంపికైనట్లు ఫిజికల్ డైరక్టర్ ఎం.కోటేశ్వరరావు తెలిపారు. పెదగుమ్మూరు హైస్కూల్‌లో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్-17 వాలీబాల్ టోర్నమెంట్ ప్రతిభ చూపడం ద్వారా దుర్గాభవానీ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైంది.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపిక



టి.అర్జాపురం విద్యార్థులు జయ, జానకి, యమున

రావికమతం, అక్టోబరు 2 : మండలంలో టి.అర్జాపురం హైస్కూల్‌కు చెందిన ముగ్గురు బాలికలు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్టు పీడీ రమేష్‌నాయుడు తెలిపారు. తమ స్కూలుకు చెందిన జయ, జానకి, యమునలు ఇటీవల బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి హైస్కూల్‌లో జరిగిన అండర్ 14-బాలిక రగ్బీ పోటీలో ప్రతిభ కనబరచడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైటనట్టు రమేశ్ తెలిపారు.

చీడికాడ : మండలంలోని వరహాపురం జడ్పీ హైస్కూలుకు చెందిన డి.లోవవర్దన్, ఎస్.నీలవర్ద న్, వి.కృష్ణవేణి, జి.వసంత, ఎస్. లిఖితతో పాటు పలువురు విద్యార్థు లు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం వరాహమూర్తి, పీడీ ఆర్.సింహాచలం తెలిపారు.



వరాహాపురం హైస్కూలు విద్యార్థులు

బుచ్చెయ్యపేట : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రబ్బీ, తైక్వాండో పోటీలకు వడ్డాది కెపీడీ జడ్పీ హైస్కూల్‌కు చెందిన తేజశ్విని, జీవీ శశి ఎంపికైనట్టు హెచ్‌ఎం శేషుబాబు, పీఈటీ నర్సింగరావు తెలిపారు. ఈ నెల 6,7,8వ తేదీల్లో తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏయూలో కొత్త కోర్సులు

... 5వ పేజీ తరువాయి

ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తెలిపారు. నూతనంగా ప్రారంభించబోయే కోర్సులతో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందునే వర్సిటీలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

ఇతర కోర్సులపై కూడా అధ్యయనం చేస్తున్నామని, వాటికి ఉన్న డిమాండ్, విద్యార్థులు చేరేందుకు గల అవకాశాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకు వస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.